


- ఓలేటి శ్రీనివాసభాను

ద్రావకాలు,మెటల్ పాలిష్‌లూ అవసరం లేదు. పిడికెడు కచ్చిక తీసుకొని ఓసారి రుద్ది 'ఉఫ్'మని ఊదేస్తే చాలు-క్యాబిన్ మెన్ కనకారావు హ్యాండ్ సిగ్నల్ ల్యాంప్ కనకంలాగా మెరిసిపోతుంది. కల్తీలేని ఇత్తడితో లండన్‌లో తయారయింది మరి!అలాంటి ఇత్తడి ఇప్పుడు పుటం పెట్టి వెదికినా దొరకదు.

# దీపంలాంటి జ్ఞాపకం....








అది కనకారావుకి కంటిపాప. నైట్ డ్యూటీలో అతని హస్తభూషణం. అప్పటికే మూడు తరాల ఇంటి దీపం! మొట్టమొదట లండన్‌లో స్టేషన్ మాస్టర్‌గా పనిచేసిన జార్జ్ ఆక్టన్ ఆ హ్యాండ్ సిగ్నల్ ల్యాంప్‌ని ఉపయోగించాట్ట. అక్కడ్నించి బెంగాల్-నాగ్‌పూర్ రైల్వేలో గార్డుగా పనిచేసిన ఆయన మేనల్లుడు జెఫ్ ఆర్నాల్డ్ ముచ్చటపడి దాన్ని ఇండియా తీసుకొచ్చాట్ట. జెఫ్ ఆర్నాల్డ్ రిటైర్ అయినప్పుడు ఆయన దగ్గర 'బాక్స్ బాయ్'గా పనిచేసిన కనకారావు మోజు పడితే దాన్ని బహుమతిగా ఇచ్చాడట.

కనకారావు ఆ కథని చాలా మందికి చాలాసార్లు చెప్పాడు అలా విన్న శ్రోతల్లో కనకారావు కొడుకు నూకరాజు కూడా ఉన్నాడు. తండ్రి చేతిలో ఆ ల్యాంప్‌ను చూసిన ప్రతీసారి అతని చేత ఆ కథని మళ్లీ మళ్లీ చెప్పించుకునేవాడు. క్యాబిన్‌లో నైట్ డ్యూటీ వున్న రోజు కనకారావు సాయంత్రం ఆయిదింటికే స్టేషన్‌కి వెళ్లేవాడు. స్టేషన్



మాస్టర్ ఎదుట హ్యాండ్ సిగ్నల్ ల్యాంప్ పట్టుకొని నిలబడేవాడు. ఇద్దరూ కలిసి స్టేషన్ బిల్డింగ్‌ని ఆనుకొని వున్న 'ఆయిల్ రేమ్'కి వెళ్లేవారు. అదో రేకుల షెడ్డు. అక్కడికి చేరుకోగానే స్టేషన్ మాస్టర్ ఉబ్బెత్తుగా వున్న జేబులోంచి బరువైన తాళాల గుత్తిని కనకారావు చేతికి అందించేవాడు. కనకారావు కళ్లు మూసుకొని ఆ గుత్తిలోని ఓ తాళం చెవిని కుడిచేతి చూపుడువేలుకి, బొటనవేలుకీ మధ్య ఒడుపుగా వుంచి, చిటికెలో ఆయిల్ రూమ్ తాళం కప్పని తెరిచేవాడు. బర్‌ర్ మంటూ రేకు తులుపుని బయటకు లాగేవాడు. లోపల నుంచి కిరసనాయిలు వాసన గుప్పుమంటూ వచ్చేది. ఆ వాసనంటే కనకారావుకి ఎంత ఇష్టమో. తండ్రితో పాటు ఆయిల్ రూమ్‌కి వెళ్లే నూకరాజుకీ అంతే ఇష్టం! అందులో రెండు, మూడు కిరసనాయిలు డ్రమ్ములు, కుప్పగా పోసిన కాటన్ వేస్ట్ వుండేవి. అక్కడ సీలు తెరిచిన డ్రమ్ము లోంచి పొడుగాటి కాడ వున్న అల్యూమినియమ్ పాత్రలో తన కోటా కిరసనాయిల్ని కనకరావు 'మినీ బాత్ టబ్' లాంటి నల్లటి డొక్కులో పోసుకునేవాడు. దానితో పాటు అవుటర్, హోమ్ స్టార్టర్ సిగ్నల్స్‌లో వెలిగించాల్సిన దీపం బుడ్డీల్ని బయటకు తీసుకొచ్చేవాడు. అక్కడ కనకారావు పూజ చేసినంత శ్రద్ధగా, ఇష్టమైన పదార్థాన్ని భుజించేంత ఆసక్తిగా తన పని చేసేవాడు. మొదటి దళసరిగా వుండే గుడ్డతో మసిని తుడిచి, నాలుగు వేళ్లకీ పలచని వస్త్రాన్ని చుట్టకొని మరోసారి శుభ్రం చేసి, నవారులాగా వుండే బర్నర్ వత్తుల్ని పైకీ, కిందకీ ఆడించి, కొడిగట్టిన కొసల్ని-మీసాల్ని కత్తిరించినంత ఓపిగ్గా 'ట్రిమ్' చేసి ఒక్క చుక్కయినా నేల మీద పడకుండా అన్నిట్లో కిరసనాయిలు నింపేవాడు. ఇదంతా కళ్లప్పగించి చూసేవాడు నూకరాజు. ఆ తరువాత జరగబోయే ఘట్టాన్ని చూడడం అంటే ఆ కుర్రాడికి ఎంతో ఇష్టం. తండ్రి వెనక అడుగులు వేసుకుంటూ, హ్యాండ్ సిగ్నల్ ల్యాంప్ మోసుకుంటూ నూకరాజు వెళ్లేవాడు.

ఇద్దరూ కలిసి ముందు హోమ్ సిగ్నల్‌కి వెళ్లేవారు. అక్కడ ఇనప నిచ్చెన మీంచి సిగ్నల్ పైకి కనకారావు ఎక్కుతుంటే-నూకరాజు కంటికి అతను టెన్సింగ్ నార్కేలాగా కనిపించేవాడు. అలాగే స్టీమ్ ఇంజను డ్రైవర్‌ని చూసినా, 'పాస్ త్రూ' ట్రయిన్‌లో పచ్చజెండా ఊపే గార్డుని చూసినా, ప్లాట్‌ఫారమ్ మీద అందరి నమస్కారాలూ అందుకునే స్టేషన్ మాస్టారన్నా, ట్రాలీలో ఝుయ్ః మంటూ వెళ్లే పిడబ్ల్యూఇ గారన్నా నూకరాజుకి దేవుళ్లే అనిపించేది. రైల్వే పరికరాలతో, పరిసరాలలో ఆత్మీయ బంధం అల్లుకుపోయింది.

ఓసారి నూకరాజు అమ్మతో కలిసి తాతగారింటికి విశాఖపట్నం వెళ్లాడు. అక్కడ మేనమామ నూకరాజుని ఎగ్జిబిషన్‌కి తీసుకెళ్లి స్టీమ్ ఇంజన్ బొమ్మ కొని పెట్టాడు. తమ ఊరికి తిరిగొచ్చాక, అమ్మ రేకు పెట్టెను తెరచి చూస్తే రైలింజన్ బొమ్మ తాలుకూ వెనక చక్రాల జత ఊడిపడింది. నూకరాజు ఒకటే ఏడుపు. ఆ రాత్రి తిండి తినలేదు. నిద్రపోలేదు. మర్నాడు ఉదయం చూస్తే నూరాజు పడుకొన్న మంచం ఖాళీగా కనిపించింది. తల్లి కంగారు పడింది. కాలనీ చివరి వరకూ వెళ్లి అక్కడ పట్టాలకి అవలున్న క్యాబిన్ వైపు చేతులూపుతూ కనకారావుని పిలిచింది. నైట్ డ్యూటీ ముగించి, క్యాబిన్ మెట్లు దిగుతున్న కనకారావు గబగబా పట్టాలు దాటి వచ్చాడు. కాలనీ మొత్తం వెతికారు. ప్లాట్‌ఫారమ్ గాలించారు. నూకరాజు కనిపించలేదు. అలా తిండీ తిప్పలూ లేకుండా మధ్యాహ్నం వరకూ ఊరంతా గాలించి, ఊసురుమంటూ వీధి పంచలో భార్యభర్తా కూలబడ్డారు. నూకరాజు తల్లి ఏడుపు మొదలు పెట్టింది. కాలనీ ఆడవాళ్లంతా ఆవిడ చుట్టూ మూగారు. కనకారావుకీ పరిస్థితి అలాగే వుంది.

మధ్యాహ్నం ఒంటి గంటకి ఫోర్టీవన్ అప్ ప్యాసింజరు వచ్చింది. ట్రయిన్ ఇంజన్ వాటర్ కాలమ్ దగ్గర సరిగ్గా కనకారావు క్వార్టర్స్ ముందు ఆగింది. అందులోంచి ఫైర్‌మెన్ జానీ, తలకి కట్టుకున్న గుడ్డ జారిపోతున్నా లెక్కచేయకుండా కిందకి దిగాడు. ప్లాట్‌ఫారమ్ అంచు వరకూ వచ్చి 'మిస్టర్ కనకారావ్' అంటూ గట్టిగా పిలిచాడు. కనకారావు తలెత్తి చూశాడు. ఫైర్‌మెన్ జానీతో పాటు పక్కనే పదేళ్ల నూకరాజు. కనకారావులో ఆనందం, దుఃఖం ఒకేసారి వెల్లువెత్తాయి. పరుగుతీశాడు. ప్లాట్‌ఫారమ్ చేరుకున్నాడు. నూకరాజుని ఎత్తుకొని ముద్దాడుతూనే, ఏడుపుతో కూడిన కోపంతో అదిలించబోయాడు. ఫైర్‌మెన్ జానీ వారించి, జరిగిందంతా చెప్పాడు.

ఆ రోజు ఉదయం ఫార్టీ టూ డౌన్ ప్యాసింజరులో నూకరాజు అయిదుస్టేషన్ల అవతలున్న జంక్షన్‌కి వెళ్లాడు. అక్కడ మార్షలింగ్ యార్డ్‌ని దాటుకొని దూరంగా వున్న లోకోషెడ్‌కి చేరుకున్నాడట. స్టీమ్ ఇంజన్లని అక్కడ రిపేర్ చేస్తారని తండ్రి చెప్తే నూకరాజు విన్నాడు. అందుకే లోకోషెడ్డుని వెతుక్కుంటూ ఆ అబ్బాయి వెళ్లాడు. అందులో పనిచేస్తున్న వాళ్లంతా బొగ్గుతో పోటీపడుతున్నారు. చాలా మందికి చొక్కాల్లేవు. బనీన్లు నల్లగా మసిబారి వున్నాయి. అక్కడ ఓ చోట గొయ్యి మీది పట్టాలున్నాయి. పైన ఇంజన్ వుంది. అందులో నిప్పు లేదు. చప్పుడూ లేదు. బొమ్మ ఏనుగులా నిలబడి వుంది. ఇంజన్ నడి నెత్తి మీద ఇద్దరు, కింద గోతిలో ముగ్గురు పెద్ద పెద్ద నట్‌లూ, బోల్టులూ బిగిస్తున్నారు. నూకరాజు వాళ్లని సమీపించాడు. భుజానికి వున్న సంచీ లోంచి స్టీమ్ ఇంజన్ బొమ్మని తీసి, చక్రాలు బాగు చెయ్యమంటూ బతిమాలాడు. అక్కడి వాళ్లంతా నవ్వారు. నూకరాజుని చూసి జాలిపడ్డారు. అప్పుడే డ్యూటీకి వచ్చిన జానీ విషయం తెలుసుకున్నాడు. నూకరాజుని తనతో పాటు ప్యాసింజర్‌లో తీసుకొచ్చి కనకారావుకి అప్పజెప్పాడు.

**నలభైయేళ్ల తరువాత..**

ఆ జ్ఞాపకాల్ని తలుచుకున్నప్పుడల్లా, మెయిన్ గార్డు నూకరాజు ఒళ్లు పులకరిస్తుంది. ఇప్పుడు ఆ స్టీమ్ ఇంజన్లు లేవు. అలనాటి హ్యాండ్ సిగ్నల్ ల్యాంపులు లేవు. నూకరాజు పనిచేసే బళ్లన్నీ కరెంటుతో నడుస్తాయి. అతని హ్యాండ్ సిగ్నల్ ల్యాంప్ పవర్‌ఫుల్ బ్యాటరీతో పనిచేస్తుంది.

ఆ మధ్య భారతీయ రైల్వేలకి నూట యాభై యేళ్ళు నిండాయని వేడుకలు చేశారు. ఆ సందర్భంగా 'హెరిటేజ్ రన్' పేరుతో పాత స్టీమ్ ఇంజన్లని పట్టాలకెక్కించారు. చుక్ చుక్ మంటూ పొగ బండి రోజుల్ని కళ్లకు కట్టింది. తమ డివిజన్‌లో కీలక ప్రాంతాన్ని చుట్టి వచ్చిన హెరిటేజ్ ట్రయిన్‌కి నూకరాజు గార్డుగా పనిచేశాడు. అప్పుడు తన తండ్రి నుంచి వారసత్వ సంపదగా వచ్చిన కిరోసిన్ హ్యాండ్ సిగ్నల్ ల్యాంప్‌ని ఉపయోగించి 'హెరిటేజ్'కి అర్థం చెప్పాడు నూకరాజు. ఆ మర్నాడు పత్రికల్లో హ్యాండ్ సిగ్నల్ ల్యాంప్‌తో బ్రేక్ వ్యాన్‌లో నిలబడిన నూకరాజు ఫోటో, ఇంటర్వ్యూలు వచ్చాయి. దాంతో ఆ ఏడాది రైల్వే బోర్డు పురస్కారం అందుకోవడానికి నూకరాజు ఢిల్లీ వెళ్లాడు.

దేశరాజధాని నుంచి తీసుకొచ్చిన వెండి మెడల్‌ని తన తండ్రి ఫోటోకి వేలాడ దీసి, కన్నీళ్లు తుడుచుకున్న నూకరాజుకి బాల్యం కళ్ల ముందు పరుగులు తీసింది. అందులో కిరసనాయిల్ పరిమళించింది. ఇనప నిచ్చెన మీంచి కనకారావు టెన్సింగ్ నార్కేలా అధిరోహిస్తూ సిగ్నల్ దీపాల్ని వెలిగిస్తున్న దృశ్యం కనిపించింది.

*

